క్లుప్తంగా

మల్లన్న ఆలయంలో పూజలు



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో ముంపునకు గురైన రత్నాపూర్ గ్రామ మల్లన్న ఆలయం ముంపులో నుంచి బయల్పడింది. దీంతో మల్లన్న భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో పోటెత్తి ప్రత్యేక పూజలు చేశారు. జగిత్యాల్ జిల్లాలో పునరావాసంలో ఏర్పడిన రత్నాపూర్ గ్రామం నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

స్టేడియం నిర్మాణానికి విరాళం

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియ నిర్మాణానికి మండల కేంద్రానికి చెందిన ఫన్నీర్ అభినయ్ రూ. 5 వేల విరాళం అందించారు. ఈ సందర్భంగా కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి క్రీడలను ప్రోత్సహించాలన్నారు. క్రీడాకారులు, స్థానికులు పాల్గొన్నారు.

నేషనల్ హెల్త్ మిషన్‌ను వినియోగించుకోవాలి



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు నేషనల్ హెల్త్ మిషన్ టీం సభ్యులు సంచరిస్తారని పోచంపాడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి రాకేశ్ అన్నారు. మండల కేంద్రంలోని ఏర్పాట్లను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ టీం సభ్యులు నేషనల్ హెల్త్ ప్రోగ్రాంలు చేస్తారని పేర్కొన్నారు. ఇమ్యునైజేషన్ కార్డులు, ఎన్‌సీడీ రికార్డ్స్, టీబీ కార్డు వివరాలు ముఖాముఖిగా మాట్లాడుతారని అన్నారు. వారి సేవలను ప్రజలు వినియోగించుకోవాని కోరారు. ఆయన వెంట వైద్యా సిబ్బంది తదితరులు ఉన్నారు.

అధ్యాపకుల ప్రచారం



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు విద్యార్థులను పంపించాలని కోరుతూ మండల కేంద్రంలో కళాశాల ప్రిన్సిపాల్ చిన్నయ్య ఆధ్వర్యంలో అధ్యాపకులు ఆదివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కళాశాలలో అందిస్తున్న కోర్సుల గురించి విద్యార్థుల తల్లితండ్రులు, విద్యార్థులకు వివరించారు. ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్లు తీసుకోవాలని కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

భీమ్‌గల్: స్వర్ణకార వ్యాపార సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సుంకం నర్సయ్య, ఉపాధ్యక్షుడిగా మంచిర్యాల గణేత్, ప్రధాన కార్యదర్శిగా శ్రీపాద శ్యామ్‌సుందర్, సహాయ కార్యదర్శిగా గంగదాస్, సభ్యులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నర్సయ్య మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

కన్వీనర్ కోటాలో నాన్ లోకల్ విద్యార్థులకు నష్టం

భీమ్‌గల్: ఉన్నత విద్య ప్రవేశ కోర్సుల్లో కన్వీనర్ కోటాలో నాన్ లోకల్ కోటా 15శాతంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని బీజేపీ మండల నాయకుడు ఆరె రవీందర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చే జూన్ 2వ తేదీతో రాష్ట్రం ఏర్పడి పదేళ్లు అవుతున్న సందర్భంగా విభజన చట్టంలో ఉన్న హామీ ప్రకారం జూన్ 2వ తేదీన రాష్ట్రానికి ఈ కన్వీనర్ కోటా నాన్ లోకల్ కింద 15శాతం వర్తిస్తుందన్నారు. ఈ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని తెలంగాణ విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.

దరఖాస్తు చేసుకోవాలి

ఆర్మూర్: ఆర్మూర్ డివిజన్ పరిధిలో పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో 90 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించిన మేరు కులస్తులైన విద్యార్థులకు పట్టణ మేరు సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దీకొండ కిషన్, కొక్కు వినోద్ ఆదివారం తెలిపారు. ఉత్తమ ఫలితాలు పొందిన విద్యార్థులు 9948924935, 9948974782 నంబర్లను సంప్రదించాలని కోరారు.

నిర్లక్ష్యానికి తొమ్మిది నెలలు!

- ప్రారంభానికి నోచుకోని నూతన భవనాలు
- వినియోగంలోకి తేవాలంటున్న ప్రజలు



రూ. 35లక్షలతో నిర్మించిన గ్రంథాలయ భవనం



రూ.10 లక్షలతో నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్రం

రుద్రూర్: మండల కేంద్రంలో అన్ని హంగులతో నిర్మించిన ప్రభుత్వ నూతన భవనాలు అధికారుల నిర్లక్ష్యంతో ప్రారంభానికి నోచుకోవడం లేదు. గత ప్రభుత్వ హయాంలో రూ. 10 లక్షల వ్యయంతో ఆరోగ్య ఉప కేంద్రం, రూ. 35 లక్షలతో గ్రంథాలయ భవనాన్ని నిర్మించారు. వీటి నిర్మాణాలు పూర్తి కావడంతో నాటి స్పీకర్ హోదాలో ఉన్న ప్రస్తుత బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి గతేడాది ఆగస్టులో ప్రారంభించారు.

ఈ భవనాలు ప్రారంభించి తొమ్మిది నెలలు కావస్తున్నా అలంకార ప్రాయంగానే మారాయి. రూ. కోట్లు వెచ్చించి నిర్మించిన భవనాలను వదిలేసి అద్దె గదుల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. చాలీచాలని అద్దె గదుల్లో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆరోగ్య ఉప కేంద్రంలో చిన్నారులకు టీకాలు, గర్భిణులకు పరీక్షలు చేస్తుంటారు. సొంత భవనం లేనందున అద్దె భవనంలో విధులు నిర్వహించడానికి సిబ్బంది, వైద్య సేవల కోసం వచ్చే వారు అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రంతో పాటు చుట్టు పక్కల నిరుద్యోగులు, యువకులు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు గ్రంథాలయానికి వస్తుంటారు.

ప్రస్తుత గ్రంథాలయం నిర్వహిస్తున్న అద్దె గదిలో కేవలం ఐదుగురు మాత్రమే కూర్చోవడానికి స్థలం ఉంది. మిగిలిన వారు బయట నిలబడి చదవాల్సిన దుస్థితి నెలకొంది. వీరి అవస్థలను దృష్టిలో ఉంచుకొని రూ. 35 లక్షలు వెచ్చించి విశాలమైన గదులతో స్వంత భవనం నిర్మించారు. దీన్ని స్వాధీనం చేసుకోవడానికి సంబంధిత శాఖ అధికారులు కుంటి సాకులు చెబుతున్నారు. స్వల్ప పనులు ఉన్నాయని ఒక సారి, నీటి సౌకర్యం, విద్యుత్ కనెక్షన్ లేదని మరోసారి చెప్పి వాయిదా వేస్తున్నారు. కార్యాలయాలు ప్రారంభించి తొమ్మిది నెలలు అవుతున్నా చిన్న చిన్న పనులు ఎందుకు చేయించడం లేదని పాఠకులు ప్రశ్నిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో స్వంత భవనాలు లేవని బాధ పడుతుంటే.. రుద్రూర్‌లో మాత్రం అధికారుల నిర్లక్ష్యంతోనే పూర్తయిన భవనాలను అలంకారప్రాయంగా ఉంచుతున్నారని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు వీటిపై దృష్టి సారించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

ఇరుకు గదితో ఇబ్బంది..



కొత్త గ్రంథాలయ భవనం నిర్మించినా ఫలితం లేకుండా ఉంది. ఇరుకుగా ఉన్న అద్దె రూంలో చదవాల్సి వస్తోంది. దీంతో చదువుపై ఏకాగ్రత దెబ్బతింటుంది. ఉన్నతాధికారులు ఇకనైనా స్పందించి కొత్త బిల్డింగ్‌ను త్వరగా ప్రారంభించాలి. సమస్యను త్వరగా పరిష్కరించాలి. – టి నిఖిల్, నిరుద్యోగి, రుద్రూర్

పక్కా భవనం అవసరం



మండల కేంద్రంలో గ్రంథాలయానికి పక్కా భవనం చాలా అవసరం. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న చాలా మంది గదులను అద్దెకు తీసుకుని ప్రిపేర్ అవుతున్నారు. రూ. లక్షలు వెచ్చించి కట్టినా బిల్డింగ్‌ను వృథాగా ఉంచడం బాగా లేదు. వెంటనే అందుబాటులోకి తేవాలి – జి సాయిప్రసాద్, ప్రైవేటు ఉద్యోగి, రుద్రూర్

కొత్త బిల్డింగ్‌లోకి మారుస్తాం

నూతనంగా నిర్మించిన గ్రంథలయ భవనం ప్రారంభోత్సవం జరిగినా సౌకర్యాలు లేనందువల్ల అందుబాటులోకి తేలేదు. ప్రస్తుం విద్యుత్, నీటి సౌకర్యం కల్పించాం. త్వరలో కొత్త బిల్డింగ్‌లోకి మారుస్తాం. పాఠకుల సమస్యలను పరిష్కరిస్తాం. – బుగ్గారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి

క్రీడలతో మానసిక ఉల్లాసం



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ

బోధన్‌రూరల్: క్రీడలతో మానసిక ఉల్లాసాన్ని పొందవచ్చని బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెగడపల్లిలో ఆదివారం నిర్వహించిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. యువత క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అనంతరం ఫైనల్ మ్యాచ్‌లో ఐలాపూర్ జట్టు, పెగడపల్లి తలపడగా ఐలాపూర్ జట్టు విజేతగా నిలిచింది. విజేత జట్టుకు ట్రోఫీ, రూ.25,555లు నగదు బహుమతి, రన్నరర్‌గా నిలిచిన పెగడపల్లి జట్టుకు రన్నరర్ ట్రోఫీ, రూ.12,222 నగదును మున్సిపల్ చైర్‌పర్సన్ అందజేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, యువకులు పాల్గొన్నారు.

సమాజానికి మార్గదర్శి



నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఆర్మూర్: పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా పోరాటాలు చేసి, రాజకీయాలకు కొత్త మార్గాన్ని చూపి సమాజానికి మార్గదర్శిగా నిలిచిన పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ప్రతీ ఒక్కరికి ఆదర్శప్రాయమని సీపీఎం ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేశ్ అన్నారు. పట్టణంలోని శాస్త్రీనగర్‌లో ఉన్న సీపీఎం కార్యాలయంలో సుందరయ్య 39వ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి కుతాడి ఎల్లయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం వెంకటేశ్ మాట్లాడుతూ.. అసమానతలకు వ్యతిరేకంగా ఆయన చేపట్టిన ఉద్యమాలను వివరించారు. కార్యక్రమంలో సభ్యులు కొండ గంగాధర్, బామండ్ల రవి, టి భూమన్న, సాయిలు, అజిత్ ఖాన్, కుల్దీప్ శర్మ, కల్లుబాయి గంగామణి, ఖలీల్ హసీనా, పద్మ రిజ్వానా బేగం, అమీర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో తరిస్తూ..



రక్తదానం చేస్తున్న ప్రళయ్‌తేజ్



గోశాలలోని పశువులకు మేత కోసం గడ్డిని తరలిస్తున్న ప్రళయ్‌తేజ్

- ఆదర్శంగా నిలుస్తున్న ప్రళయ్‌తేజ్

మాక్లూర్: మండలంలోని కల్లెడి గ్రామానికి చెందిన ప్రళయ్‌తేజ్ సామాజిక సేవే లక్ష్యంగా ముందుకు సాగుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఎవరైనా ఆపదలో ఉన్నారంటే తక్షణమే స్పందిస్తూ వారికి అండగా నిలుస్తున్నారు. రోడ్డు ప్రమాదాల్లో ఎవరైనా ప్రాణాప్రాయ స్థితిలో ఉంటే వారికి రక్తదానం చేసి ప్రాణదాతగా నిలిచిపోతున్నారు. ప్రతి ఏడాది గోశాలలోని పశువులకు ట్రాక్టర్‌లో గడ్డిని తీసుకెళ్లి అందిస్తున్నారు. వృద్ధాశ్రమాలకు వెళ్లి తనకు ఉన్న దాంట్లో విరాళం అందించి ఉదారతను చాటుతున్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రోగులు కూర్చోడానికి బెంచీలను ఏర్పాటు చేశారు. సొంత డబ్బులతోనే గ్రామంలో శివాజీ విగ్రహాన్ని నెలకొల్పి ప్రముఖుల ప్రశంసలు అందుకున్నారు. అంతేకాకుండా చదువులో ప్రతిభ కనబచ్చే విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తూ వారిని ఉత్తేజ పరుస్తున్నారు. ప్రళయ్‌తేజ్ చేస్తున్న సేవలను పలువురు ప్రముఖులు, గ్రామస్తులు అభినందనలు తెలుపుతున్నారు.

సంతోషంగా ఉంది



ప్రళయ్‌తేజ్ మా గ్రామస్తుడై ఉండటం అదృష్టంగా భావిస్తున్నాం. ఎవరికి ఏ ఆపద వచ్చిన క్షణాల్లో చేరుకుంటాడు. దగ్గరుండి సమస్యలను పరిష్కరిస్తున్నాడు. గ్రామంలో ఇప్పటికే సొంత డబ్బులతో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టాడు. గ్రామస్తులకు ఇంతలా సేవ అందిస్తున్నందుకు సంతోషంగా ఉంది. ప్రళయ్‌తేజ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలి. – ఇస్సపల్లి భూమన్న, కల్లెడి గ్రామస్తుడు

పడగల్ ప్రైమరీ స్కూల్ అదుర్స్



పడగల్ ప్రాథమిక పాఠశాల

- విద్యార్థులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు
- ఒకటో తరగతి నుంచి ఆంగ్లంలో విద్యాబోధన
- 12 ఏళ్లలో గురుకులాలకు 220 మంది ఎంపిక
- ఉపాధ్యాయుల కృషితోనే ఉత్తమ ఫలితాలు

వేల్పూర్: మండలంలోని పడగల్ ప్రైమరీ స్కూలు గురుకుల పాఠశాలలకు విద్యార్థులను తీర్చిదిద్దడంలో అందెవేసిన చేయిగా నిలుస్తోంది. పన్నెండేళ్ల కాలంలో ఈ పాఠశాల నుంచి 220 మంది విద్యార్థులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలలకు ఎంపికయ్యారు. 2023లో ఏకంగా 36 మంది విద్యార్థులు ఈ పాఠశాల నుంచి గురుకుల స్కూళ్లకు ఎంపికవ్వడం విశేషంగా చెప్పొచ్చు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో జిల్లాలో ఏ పాఠశాలకు సాధ్యం కానిది ఈ పాఠశాల సొంతం చేసుకుంది. 2012లో నలుగురుతో మొదలైన ఈ ప్రస్థానం ప్రతి ఏడాది పెరుగుతూ గురుకుల పాఠశాలలకు ప్రతి ఏటా పది మందికి పైగా ఎంపికయ్యేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దుతున్నారు.

హెచ్‌ఎం జమాలుద్దీన్, ఉపాధ్యాయులు డి ప్రశాంత్, కె శంకర్, ఎం మల్లేశ్, ఎస్ శ్యామల పాఠశాలల ప్రారంభంలో గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించి విద్యార్థులను స్కూల్‌లో చేర్చుకుంటున్నారు. ప్రైవేటుకు దీటుగా ఆంగ్లంలో బోధించే విషయాన్ని, గురుకుల పాఠశాలలకు ప్రతి ఏటా ఎంపికవుతున్న విద్యార్థుల గురించి తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. దీంతో తల్లితండ్రులు తమ పిల్లలను ప్రైవేటుకు కాకుండా ప్రభుత్వ ప్రైమరీ స్కూల్‌కు తరలిస్తున్నారు. ప్రతి ఏడాది ప్రైమరీ స్కూల్‌లో సుమారు 150కి పైగా విద్యార్థులు చదువుతున్నారు.

గురుకులాలకు ఎంపిక

పాఠశాల నుంచి విద్యార్థులను ప్రతి ఏడాది గురుకులాలకు ఎంపికయ్యేలా ఉపాధ్యాయ బృందంగా విశేషంగా కృషి చేస్తోంది. 2012–13లో 4గురు, 2013–14లో 7గురు, 2014–15లో 5గురు, 2015–16లో 8 మంది, 2016–17లో 18 మంది, 2017–18లో 24 మంది, 2018–19లో 22 మంది, 2019–20లో 16 మంది, 2020–21లో 21 మంది, 2021–22లో 20 మంది, 2022–23లో 36 మంది, 2023–24లో 18 మంది, 2024–25లో 15 మంది విద్యార్థులు గురుకుల పాఠశాలలకు ఎంపికయ్యారు.

అందరి కృషితోనే..

పాఠశాలలో ఉపాధ్యాయులందరం సమష్టిగా పని చేసి విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో పట్టు సాధించే విధంగా బోధిస్తున్నాం. దాంతో విద్యార్థులు ప్రతి ఏటా అధికంగా గురుకుల స్కూళ్లకు ఎంపికవుతున్నారు. గ్రామస్తులు కూడా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపుతూ సహకరిస్తున్నారు. ప్రతి ఏడాది ఎక్కువ మంది విద్యార్థులు గురుకులాలకు ఎంపిక కావడం సంతోషంగా ఉంది. – జమాలుద్దీన్, హెచ్‌ఎం

అద్దె భవనంలోకి మహాత్మా జ్యోతీబాపూలే పాఠశాల

- ఇప్పటి వరకు బీసీ వసతి గృహంలో కొనసాగిన వైనం



మోర్తాడ్‌లో అద్దెకు తీసుకున్న పాఠశాల భవనం

మోర్తాడ్: అరకొర వసతులతో నెట్టుకొచ్చిన మహాత్మా జ్యోతీబాపూలే గురుకుల పాఠశాలకు విశాలమైన అద్దె భవనం లభించింది. బీసీ విద్యార్థి వసతి గృహంలో కొనసాగిన ఈ పాఠశాల అక్కడ సరైన వసతులు లేకపోయినా ఆరేళ్లు కొనసాగింది. 150 మంది విద్యార్థులకు సరిపడే భవనంలో 400ల మంది విద్యార్థులకు వసతి కల్పించడం ఎంతో కష్టమైంది. దీంతో అనేక మంది విద్యార్థులు టీసీలు తీసుకుని తమ ఇళ్లకు చేరి మరో పాఠశాలలో చేరారు. దీంతో వసతి లేకపోవడంతో డిచ్‌పల్లి మండలం ధర్మారం గురుకుల పాఠశాలలోనే ఇక్కడి ఇంటర్ విద్యార్థులకు వసతి కల్పించి చదువు చెప్పారు. బీసీ గురుకుల పాఠశాలను వసతి గృహంలో కొనసాగిస్తే ఏటేటా విద్యార్థుల సంఖ్య తగ్గిపోయే అవకాశం ఏర్పడింది. దీనిని దృష్టిలో ఉంచుకున్న స్థానిక ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల బృందం పాఠశాల విద్యార్థులకు వసతి, తరగతుల నిర్వహణకు విశాల మైన భవనం అవసరమని ఉన్నతాధికారులకు నివేదించారు. స్థానికంగా ఓ ప్రైవేటు పాఠశాల కోసం నిర్మించిన భవనాన్ని బీసీ గురుకులం కోసం అద్దెకు తీసుకున్నారు. ప్రతి నెలా రూ.30వేల వరకు అద్దె చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్న బీసీ గురుకుల సొసైటీ ఉన్నతాధికారులు పాఠశాల తరలింపునకు పచ్చజెండా ఊపారు. 2024–25 విద్యా సంవత్సరం తరగతు లు కొత్త భవనంలోనే కొనసాగనున్నాయి. ఇప్పటికే అడ్మిషన్లను ఈ కొత్త భవనంలోనే స్వీకరిస్తున్నారు.

ధర్మారంలో వసతి కల్పించి..

ఇక్కడ వసతి లేకపోవడంతో మోర్తాడ్‌లోని ఇంటర్ విద్యార్థులకు ధర్మారంలో వసతి కల్పించి తరగతులు నిర్వహించారు. ఇప్పుడు విశాలమైన భవనాన్ని అద్దెకు తీసుకోవడంతో ఇంటర్ విద్యార్థులకు ఇక్కడే తరగతుల నిర్వహణ కొనసాగించాలనే డిమాండ్ వినిపిస్తోంది. మోర్తాడ్ పాఠశాల పేరుపై ధర్మారంలో తరగతులను నిర్వహించడానికి స్వస్తిపలకాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి. ఇప్పటికే ఒక ఇంటర్ బ్యాచ్ తమ చదువును పూర్తి చేసుకుంది. ఇప్పుడు రెండో బ్యాచ్‌కు ఇక్కడే తరగతులను కొనసాగించడం మేలు అనే భావన వ్యక్తమవుతోంది. దీనిపై ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

ఇబ్బందులు లేకుండా చదువులు

అద్దె భవనంలోకి పాఠశాలను తరలించడం వల్ల విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చదువులు కొనసాగనున్నాయి. అంతేకాకుండా మంచి వసతి పొందడానికి అవకాశం ఏర్పడింది. అద్దె భవనంలోకి పాఠశాలను తరలించడానికి సహకరించిన ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు. – శ్రీకర్, ప్రిన్సిపాల్

ఘనంగా బోనాల ఊరేగింపు





డిచ్‌పల్లిలో బోనాలను ఊరేగిస్తున్న ముదిరాజ్ సంఘ సభ్యులు, సిరికొండ మండలం చిన్నవాల్గోట్‌లో..

డిచ్‌పల్లి: మండలంలోని డిచ్‌పల్లి ఖిల్లా గ్రామంలో పెద్దమ్మ తల్లి (వనదుర్గాదేవీ) ఆలయ వార్షికోత్సవాలు ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ముదిరాజ్ సంఘం సభ్యులు ఇంటికొకరు చొప్పున బోనాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లారు. అమ్మవారికి బోనాలను, నైవేద్యాలను సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో ముదిరాజ్ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ మండలంలో..

సిరికొండ: మండలంలోని చిన్న వాల్గోట్ గ్రామంలో ఆదివారం పోచమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కుల సంఘాల వారీగా బోనాలను డప్పువాయిద్యాలతో ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లారు. అమ్మవార్లకు నైవేద్యాలు, బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పుష్కలంగా పండాలని అమ్మవారిని గ్రామస్తులు వేడుకున్నారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం

రుద్రూర్: పాతంగల్ మండల కేంద్రానికి చెందిన నిరుపేద వ్యక్తి గుండెపోటుతో మృతి చెందగా అంత్యక్రియలకు మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎంఏ హకీం ఆర్థికసాయాన్ని ఆదివారం అందజేశారు. పాతంగల్‌కు చెందిన అనీష్ బతుకుదెరువు నిమిత్తం కోరుట్లలో పని చేస్తున్నాడు. అనారోగ్యానికి గురైన అనీష్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. అంత్యక్రియల నిమిత్తం మండల కేంద్రానికి తీసుకొచ్చారు. బాధిత కుటుంబం ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న హకీం రూ. ఐదు వేలు ఆర్థికసాయాన్ని అందచేశారు. నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

నగరంలో వీధి కుక్కల బెడద



నగరంలోని మహాలక్ష్మీ కాలనీలో వీధి కుక్కలు విపరీతంగా సంచరిస్తున్నాయి. రాత్రి వేళల్లో ప్రజల వెంబడి పడి మరీ ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. దీంతో కాలనీవాసులు బయటకి వెళ్లాలంటే జంకుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి వీధి కుక్కల బెడదను అరికట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

-సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

బోధన్ బస్టాండ్‌కు అవార్డు



బోధన్‌టౌన్: జిల్లాలోని బోధన్ బస్టాండ్ ఉత్తమ అవార్డుకు ఎంపికైంది. ప్రగతి చక్రంలో భాగంగా ఇచ్చే అవార్డుల్లో ఉత్తమ బస్టాండ్‌గా బోధన్ బస్టాండ్ నిలిచింది. బస్టాండ్‌లో వసతుల కల్పన, ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా బస్సుల సమయ పాలన పాటించడంతో పాటు ఇతర అంశాల్లో అవార్డులకు ఎంపిక అవడంతో పాటు రూ. 5 వేల నగదు నజరానాను అందుకుందని డిపో మేనేజర్ శ్రీనివాస్‌ఆదివారం తెలిపారు. ప్రగతి చక్రం అవార్డుల్లో భాగంగా ఉత్తమ బస్టాండ్‌గా ఎంపిక అవడం సంతోషంగా ఉందని డీఎం పేర్కొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
నిజామాబాద్ అర్బన్ & రూరల్ రాంనాథ్ : 7997958181
ఆర్మూర్ శివ : 9848956776
బాల్కొండ ప్రశాంత్ : 8919850800
బోధన్ కృష్ణ : 7997958178
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899